నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్




## కోడి గుడ్డు @రూ.8

భైంసా, డిసెంబర్ 12 : కోడి గుడ్డు ధరకు రెక్కలొచ్చాయి. మును పెన్నడూ లేని విధంగా ధరలు పలుకుతున్నాయి. ప్రాంతాలవారీగా ఒక్కో గుడ్డు ధర రూ.8కి పైనే పలుకుతున్నది. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. వేసవిలో ఉష్ణోగ్రతల కారణంగా కోళ్ల పెంపకాన్ని తగ్గించడంతో రూ.7 వరకు ధర పలికింది. ఆ తర్వాత వర్షాకాలం నుంచి దాదాపు నాలుగు నెలలపాటు కార్తీక మాసం వరకు సాధారణ స్థాయిలోనే ఉన్నాయి. మళ్లీ ఇప్పుడు డిమాండ్ పెరగడంతో గుడ్డు ధరకు రెక్కలొచ్చాయి.


అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## రేవంత్ మాట నిలబెట్టుకోవాలి..

ఎదులాపురం, డిసెంబర్ 12 : పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సమ్మె కొనసాగుతోంది. గురువారం ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద ఉన్న తెలంగాణ అమరుల వీరుల స్తూపానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దేవదర్శన్, వినోద్, ప్రకాశ్, కేశవ్, ప్రియాంక, మల్లిక, సలీం, సందీప్, సురేందర్, వెంకన్న పాల్గొన్నారు.

# ఇదేం చలిరా బాబూ..

**ఆదిలాబాద్ జిల్లావాసులను వణికిస్తున్న చలి ● ఈ యేడాది ఇప్పటివరకు ఇదే అత్యల్ప టెంపరేచర్**


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చలిమంట కాగుతున్న ప్రజలు

**కనిష్ఠ ఉష్ణోగ్రత 7 డిగ్రీల సెల్సియస్**


జిల్లా కేంద్రంలో స్వెట్టర్లతో ప్రయాణం..


ఆదిలాబాద్ శివారుల్లో పొగమంచు కమ్ముకోవడంతో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు

ఆదిలాబాద్, డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావాసులను చలి వణికిస్తున్నది. నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. రోజురోజుకు చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇదేం చలిరా బాబూ అంటూ బెంబేలెత్తిపోతున్నారు. మంగళవారం 11 డిగ్రీలు, బుధవారం 8.5 డిగ్రీలు, గురువారం 7 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన చలి ఉదయం 9 గంటల వరకు కొనసాగుతోంది. బేల మండలంలో ఈ ఏడాది అత్యల్ప ఉష్ణోగ్రత గురువారం 7 డిగ్రీలుగా నమోదైంది. రాష్ట్రంలో అతి తక్కువ ఉష్ణోగ్రతలు ఆదిలాబాద్ జిల్లాలోనే రికార్డ్ అయింది. ఆదివారం నుంచి జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతుండగా.. రాబోయే రోజుల్లో చలి ప్రభావం పెరగనుందని ప్రజలు భయపడుతున్నారు.

### రక్షణ చర్యలు

రోజురోజుకు పెరుగుతున్న చలి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉపశమనం కోసం రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. స్వెట్టర్లు, మఫ్లర్లు, మంకి క్యాప్‌లు ధరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రధాన రోడ్లతోపాటు వీధుల్లో జన సంచారం కనపడడం లేదు. జాతీయ రహదారి-44పై మంచు కారణంగా వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్తున్నారు. పల్లెల్లో ప్రజలు చలి మంటలు వేసుకుని మంటలు కాగుతున్నారు. పట్టణాల్లో రూం హీటర్లను వినియోగిస్తున్నారు. వేడి కోసం ఛాయ్‌లు తాగుతుండడంతో టీ దుకాణాల వద్ద జనసంచారం కనపడుతున్నది. చలికి తోడు ఈదురుగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత అధికంగా ఉంటుంది.


స్వెట్టర్ల దుకాణాల వద్ద ప్రజలు

## ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

బోథ్, డిసెంబర్ 12 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి టోకరా చేసిన ఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సతీశ్, రేష్మాలు సంపత్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ వినోద్ ద్వారా రాథోడ్ సంజీవ్‌కు ఫోన్‌లో పరిచయం అయ్యారు. సంపత్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ సంజీవ్ వద్ద యేడాది క్రితం రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.1.50 లక్షలు తీసుకుని ఎలక్షన్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పించారు. రాథోడ్ బాపురావ్ వద్ద కూడా రూ.1.20 లక్షలు తీసుకుని కార్లో కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికారు. ఘన్‌పూర్ గ్రామానికి చెందిన చౌహన్ మశ్చందర్, టీవీటీ పల్లెకు చెందిన ఆత్రం బాలు, ఆత్రం జంగు, సంపత్ నాయక్ తండాకు చెందిన రాథోడ్ గణేశ్‌ల వద్ద నుంచి కూడా రూ.70 వేల చొప్పున రూ.2.80 లక్షలు వసూలు చేశారు. అందరి వద్ద నుంచి దాదాపు రూ.5.50 లక్షలు వసూలు చేసి ఎవరికి ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేశారు. తమను ఉద్యోగాల పేరిట మోసం చేసిన సతీశ్, రేష్మాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ వివరించారు.


కేటీఆర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులు

## సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులు

కడెం, డిసెంబర్ 12 : సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నాయకులు కోరారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై పోలీసులు అక్రమంగా కేసులు పెడుతున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా పెండింగ్ అంశాలను కేటీఆర్ దృష్టికి తీసుకవెళ్లినట్లు నేతలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, జిల్లా సమన్వయ కర్త రాంకిషన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## గ్రూప్-2కు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 12 : గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నిర్మల్ పట్టణంలో 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 8080 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలపై శిక్షకులు రవికుమార్, పరీక్షల నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలోపరీక్షల కో-ఆర్డినేటర్ పీజీ రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారులు గోవింద్, శ్రీనివాస్, నరసింహారెడ్డి, అంబాజి, రమణ, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, సుదర్శన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులు కల్పించాలి..

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 12 : కవ్వాల్ టైగర్ జోన్‌లోని పునరావాస గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో పునరావాస గ్రామాలైన రాంపూర్, మైసంపేట్ ప్రజలకు కల్పిస్తున్న వసతులపై గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. పునరావాస గ్రామాల్లో స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజల సంక్షేమంతోపాటు అడవులను రక్షించాలన్నారు. రహదారులు, నివాసాలకు విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఎఫ్‌వో నాగినిభాను, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, ఇంజినీరింగ్ అధికారులు అశోక్ కుమార్, శంకరయ్య, డీటీడీవో అంబాజీ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ భవానీ శంకర్, అటవీ శాఖ అధికారులు అరుణ్, రాజేందర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ ఉన్నారు.



నిర్మల్ అర్బన్ : మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## లక్ష్యాన్ని చేరుకోవాలి..

**ఆహార భద్రత మిషన్ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో కలెక్టర్**

ఎదులాపురం, డిసెంబర్ 12 : సెల్ప్ హెల్ప్ గ్రూప్ సభ్యులకు విలువ ఆధారిత మిల్లెట్స్ స్టార్ట్ అప్‌లో భాగంగా భాగస్వాములను చేయాలని, సభ్యులందరూ జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను సకలంలో చేరుకోవాలని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా గురువారం జిల్లా ఆహార భద్రత మిషన్ ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జాతీయ ఆహార భద్రత మిషన్‌లో జిల్లాకు కేటాయించిన భౌతిక, ఆర్థిక లక్ష్యాలను కమిటీలో చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాకు పప్పు దినుసుల పథకంలో భౌతిక లక్ష్యం 1,29,019, ఆర్థిక లక్ష్యం రూ.1.19 కోట్లు, చిరు ధాన్యాల పథకంలో భౌతిక లక్ష్యం రూ.8,582, ఆర్థిక లక్ష్యం రూ.99.46 లక్షలు, నూనె గింజలు పథకంలో భౌతిక లక్ష్యం రూ.9,388, ఆర్థిక లక్ష్యం రూ.12.53 లక్షలు మండలాలవారీగా కేటాయించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆత్మ జి.రాంకిషన్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఉత్పల్ కుమార్, డీడీఎం నాబార్డ్ అబ్దుల్ రౌఫ్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రవీణ్‌రావు, సహాయ సంచాలకులు, కె.శివకుమార్, అష్రఫ్, రవీందర్, ఉద్యాన వన అధికారి కార్తీక్ పాల్గొన్నారు.

### లాంచింగ్‌కు ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలలో డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు కార్యక్రమ లాంచింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి గూగుల్ మీట్ ద్వారా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 14న రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, మోడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీల్లో డైట్ చార్జీలు పెంపు లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజాలింగు, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ సునీత పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ గౌష్ ఆలం
- వెయ్యి మందికి దుప్పట్ల పంపిణీ


నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

నార్నూర్, డిసెంబర్ 12 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గాదిగూడ, నార్నూర్ మండలంలోని నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెయ్యి మందికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చలి తీవ్ర నుంచి రక్షించేందుకునేందుకు దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉమ్మడి మండలంలో నెలకున్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకొస్తే అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్, ట్రెయినీ కలెక్టర్ అభినవ్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, నార్నూర్ సీఐ రహీంపా షా, ఉట్నూర్ సీఐ మొగలి, సైబర్ డీఎస్పీ అషీబుల్లా, ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్, నరింజిపటేల్, రాయి సెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు పటేల్, జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, తుడుందెబ్బ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావ్, డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, మండలాధ్యక్షుడు శ్రీరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావు, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తోడసం నాగోరావ్ పాల్గొన్నారు.

### 163 సెక్షన్ అమలు : ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, డిసెంబర్ 12 : జిల్లావ్యాప్తంగా 15,16 తేదీల్లో జరిగే టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బాల్య వివాహం చట్టరీత్యా నేరం


బాల్యవివాహాన్ని అడ్డుకున్న కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది

బజార్‌హత్నూర్, డిసెంబర్ 12 : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం అని ఎస్సై అప్పరావు తెలిపారు. గురువారం బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో మైనర్ బాలికకు బాల్య వివాహం చేస్తున్నారని 1098 చైల్డ్ లైన్ నంబర్‌కు సమాచారం అందింది. ఈ మేరకు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి స్వామి, చైల్డ్ హెల్ప్ లైన్ కో-ఆర్డినేటర్ సతీశ్‌లు బాలిక స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులు, బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించి వివాహాన్ని అడ్డుకున్నారు. ఇటువంటి బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టరీత్య కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కుటుంబ సభ్యులతో 18 ఏండ్లు నిండిన తరువాతనే వివాహం చేస్తామని తీర్మాణ పత్రం రాయించుకున్నారు.